క్లుప్తంగా

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న రాక్రే మహేందర్

ఎదులాపురం: పెయింటర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెయింటర్స్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు రాక్రే మహేందర్ ఆ రోపించారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కా ర్యాలయంలో గురువారం మాట్లాడారు. నిరుపేద పెయింటర్ కార్మికులు వారి జీవనం కోసం ప్రాణా లను అరచేతిలో పెట్టుకుని పని చేస్తున్నారని, అయినా.. ప్రభుత్వం వారిని గుర్తించడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, ప్రమాద బీమా, వైద్యం సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూని యన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉయికే రమేశ్, కోశాధికారి కోవే మారుతి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి



జైనథ్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జైనథ్: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ అనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో శ్యూర్ ఎన్‌జీవో సహకారంతో సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ సిబ్బంది, ఎన్‌జీవో ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అవగాహనతో ఎయిడ్స్ సోకకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, ఎన్‌జీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ భాను, సూపర్‌వైజర్ వేణు, ఆశాలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహ న ఉండాలని డీఏపీసీయూ ఎంఈ సతీశ్ అన్నారు. గురువారం మండలంలోని చాందా (టి) గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సాధారణ ప్రజలలో హైరిస్క్ గ్రూపులలో హెచ్ఐవి అవగాహన, పరీక్షలను పెంచడానికి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారట్ల భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాథీ, ఐసీటీసీ కౌన్సిలర్ మెహరాజ్, ఎల్‌టీ ప్రసాద్, గంగామణి, భువన, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'ఎంపీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి'

ఎదులాపురం: అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ధిక్కరించడం ఎంపీ సోయం బాపు రావుకు తగదని, ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ఆదివాసీలను మతమార్పిడులకు ప్రేరేపించే వారి గుండెల్లో బుల్లెట్లు దింపుతానంటూ ఎంపీ సోయం బాబురావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, మంజుల పాల్గొన్నారు.

'మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం'

బజార్‌హత్నూర్: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. గురువారం మండలంలోని గంగాపూర్ సమీపంలో రూ. 10 లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రాంపూర్‌లో ఏ ర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ గిరిజనులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి 10శాతం రిజర్వేషన్లు పెంచిందని, గిరిజనులకు సేవాలాల్, కుము రం భీం భవనాలను నిర్మించిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కానిందే రాజారాం, నిస్తే కైలాస్, లక్ష్మణ్, రాజేశ్వర్, సాయిచైతన్య, రాజు, క వీందర్, నరేశ్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఢిల్లీ ప్రతినిధి అనిల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో యువతకు అవగాహన కల్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి కేంద్రం నిర్వాహకురాలు రేవతి బహెన్, హిమాన్షు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు బతికేదెలా?

- ఆదుకోని, బ్యాంకులు ప్రభుత్వాలు
- వర్తించని రైతుబంధు పథకం
- అమలు కాని కౌలు రైతు చట్టం



ధనోరా సమీపంలో పొలం దున్నుతున్న కౌలు రైతు

కెరమెరి: కౌలు రైతులు అనేక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వాలు మారినా వారి తలరాతలు మారడం లేదు. చట్టాలున్నా అమలుకు నోచుకోకపోవడంతో వారు అరిగోస పడుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ససేమిరా అంటున్నాయి. ఏ పథకం వర్తించకపోవడంతో కౌలు రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

అందని పరిహారం

ఇతరులు భూములు కౌలు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కష్ట, నష్టాలకు గురవుతున్నారు. పంటల సాగుకు రుణసౌకర్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టపోతే పరిహారం పొందడం లాంటి సౌకర్యాలు వీరికి అందడం లేదు. భూమి యజమాని లేదా పట్టాదారుడి అనుమతితో పంటలు పండిస్తూ వారి హక్కులను భంగం కలగకుండా చూస్తున్నారు. ప్రారంభంలో రుణఅర్హత కార్డులను కౌలు రైతులకు అందించే ప్రక్రియను రెవెన్యూ అధికారుల ద్వారా చేపట్టారు. అది అర్ధంతరంగా నిలిచిపోయింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

800 మంది కౌలు రైతులు

కెరమెరి మండలంలో మొత్తం 6442 మంది రైతులు ఉండగా వారిలో 800 మంది కౌలు రైతులు ఉంటారు. వీరికి మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంది. కాని బ్యాంకర్లు రుణాలు ఇవ్వడానికి ససేమిరా అనడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. కౌలు రైతులపై బ్యాంకర్లు కనికరం చూపడం లేదు. ప్రతిఏటా ఖరీఫ్ ఆశించిన స్థాయిలో ఫలితాలివ్వకపోవడం, రబీలో వడగండ్లకు పంటలు నష్టపోతున్న రైతులకు భరోసా కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని, అప్పుడే పోరాడి సాధించుకున్న చట్టానికి గౌరవం దక్కుతుందని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



కెరమెరిలో ఏపుగా పెరిగిన జొన్నపంట

దళారులు, వ్యాపారుల మాయ..!

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కౌలు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో వారిలో నిరాశ నిస్పృహ అలుముకుంది. చేతిలో చిల్లీ గవ్వలేక సాగు చేసేందుకు ముందుకు వచ్చిన రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో గత్యంతరం లేక వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వ్యాపారులు, దళారులు మాయ చేసి అనుకున్న విధంగా వడ్డలకు వడ్డీలు వేసి కౌలు రైతును నిలువునా దోచుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి.

సమాచారం లేదు



కౌలు రైతుల విషయమై మాకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే చాలా మంది రైతులు వచ్చి ప్రభుత్వ సహాయం గురించి అడుగుతున్నారు. కాని తామే ఏమి చేయలేని పరిస్థితి ఉంది.

– ఎస్. గోపికాంత్, వ్యవసాయాధికారి, కెరమెరి

కరెంట్ కోతలతో పరేషాన్



కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్

కౌటాల: ఓ వైపు భానుడు భగభగమంటున్నాడు. మరోవైపు జిల్లాలోని అన్ని మండలాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు పరేషన్ అవుతున్నారు. గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో ఉక్కపోతతో భరించలేకపోతున్నారు. కొద్దిపాటి గాలివీచినా..చినుకురాలినా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు పడుతున్న బాధలు అన్నీఇన్నీకావు. కరెంటు కోతలతో ఇటు ఉక్కపోత..అటు దోమల మోతతో రాత్రివేళ నిద్రకు దూరమవుతున్నారు.

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, వైర్లు తెగిపోవడం జరుగుతుంది. దీంతో ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేసినా సరిపోతుంది. అయితే అరగంటకు, గంటకోసారి సరఫరాలో కోతలు విధిస్తున్నారు. ఇదేంటని ప్రజలు ఫోన్ ద్వారా అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కొంత అవగాహన ఉన్న వ్యక్తులు ఫోన్ చేస్తే మరమ్మతు చేస్తున్నామని పేర్కొంటున్నారు. సంబంధిత లైన్‌మెన్లను సంప్రదించాలని సమాధానం వస్తున్నట్లు పలువురు వాపోతున్నారు.

నిరుపేద మహిళకు చేయూత



సరుకులు అందజేస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్

వాంకిడి: ఆకలితో అలమటించి స్పృహ తప్పి పడిపోయిన ఓ మహిళకు చేయూతనందించి వాంకిడి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. కూలీ పనులకు వెళ్తే గాని పూటగడవని పరిస్థితిలో ఉన్న మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా లకడ్‌కోట్ గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం మండల కేంద్రానికి వచ్చి ఆకలిని తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు వాంకిడి పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు



ముస్తాబైన ఎంపీడీవో కార్యాలయం



విద్యుత్ దీపాలతో రెట్టైన పోలీస్ స్టేషన్ భవనం

రెబ్బెన: తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఈ మేరకు గురువారం అన్ని కార్యాలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా తయారు చేశారు. జెండాలకు రంగు వేసి జెండా గద్దెలను సిద్ధం చేశారు. శుక్రవారం కార్యాలయాల ఎదుట జాతీయ జెండాలు ఎగురవేయనున్నారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రోజుకో ప్రభుత్వ శాఖ సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించే రీతిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు.

కౌటాల: మండలంలోని జీపీ, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. నేటి నుంచి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయజెండాలు రెపరెపలాడనున్నాయి.

- మండల కేంద్రంలోని ఆయా కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలని, జెండా కార్యక్రమం వివరాలను తహసీల్దార్ సాయన్న ఓ ప్రకటనలో వెల్లడించారు.

పాఠశాలల్లో జెండా ఆవిష్కంచాలి..

కెరమెరి: కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని అన్ని పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించాలని ఎంఈవో కుడ్మెత సుధాకర్ అన్నారు. ఉదయమే అందరు పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలలకు చేరాలని, విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులను రావాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల లోపు తమతమ కాంప్లెక్స్ గ్రూపుల్లో జెండా ఆవిష్కరించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఏ పాఠశాల నుంచి ఫొటో రాకుంటే అది గైర్హాజరు కింద పరిగణిస్తామని తెలిపారు.

నిలువ నీడ కరువు

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- మండుటెండలో బస్సుల కోసం పడిగాపులు
- తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని వేడుకోలు



బెజ్జూర్‌లో బస్సు కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రజలు

బెజ్జూర్: ఎండలు దంచికొడుతున్నాయి. బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. మండుటెండలో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే సమయంలో వృద్ధులు, చిన్నారులు అనేక పాట్లు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. బెజ్జూర్‌లో గతంలో పలుమార్లు భూమిపూజ కార్యక్రమాలు చేసి నప్పటికి బస్టాండ్ నిర్మాణం నోచుకోవడం లేదు. దీంతో వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

చెట్ల కింద, హోటళ్లలో వేచిచూస్తూ..

మండలంలోని ఏ ఒక్క గ్రామంలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎండలు మండిపోతుండడంతో బస్సుల రాక కోసం చెట్ల కింద, హోటళ్ల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండలం నుంచి ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం కాగజ్‌నగర్‌తోపాటు ఇతర ప్రాంతాలకు ప్రజలు వెళ్తుంటారు. గతంలో కొన్నిచోట్ల బస్టాండ్ల నిర్మాణం కోసం పాలకులు భూమిపూజ చేసినప్పటికి ఇప్పటివరకు వాటి పనులు ప్రారంభించకపోవడం శోచనీయం.

బస్‌షెల్టర్ నిర్మించాలి



మా ఊరిలో బస్‌షెల్టర్ లేదు. ఏదైన ఊరికి వెళ్లాల్సి వస్తే బస్సు వచ్చేవరకు ఎండలో నిలబడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో చెట్లకింద నిల్చొని బస్సు రాక కోసం ఎదురుచూస్తున్నాం. బస్‌షెల్టర్ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నగేశ్, సిద్దాపూర్

బస్టాండ్ నిర్మించాలి



బెజ్జూర్‌లో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. చలి, వాన, ఎండా కాలంలోనూ అవస్థలు పడుతున్నాం. బస్టాండ్ లేకపోవడంతో నరక ప్రాయంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి.

– సల్మాన్, బెజ్జూర్

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం

ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నా ప్రయాణికులకు సౌకర్యాలు కరువయ్యాయి. వారి ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని, సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచుతున్నప్పటికి వసతులు మాత్రం కల్పించకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

3న రైతు దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణగౌడ్

కెరమెరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న నిర్వహించనున్న రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని రైతులందరికీ వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం ఐదు రైతు వేదికలు ఉన్నాయని, వాటిలో రైతులందరికీ సాయంత్రం 4 గంటలకు భోజన సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఉదయం రైతులు ఎడ్లబండ్లపై ర్యాలీలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణ కల్పించేలా తోరణాలు కట్టాలన్నారు. ఇళ్ల ఎదుట వాకిలి చల్లి ముగ్గులు వేయాలన్నారు. రైతు దినోత్సవానికి ఒక్క రోజే సమయం ఉన్నందున వ్యవసాయాధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధి, మండల సమాఖ్య సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. శుక్రవారం ఉదయం అన్ని కార్యాలయాల ఎదుట జెండా ఆవిష్కరణ చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏవో గోపికాంత్, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మన్నమడుగు ప్రాజెక్టు పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణగౌడ్

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామ సమీపంలో అమ్మన్నమడుగు ప్రాజెక్టును ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ గురువారం పరిశీలించారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈనెల 8న నిర్వహించే ఊరూరా చెరువుల పండుగ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై మాట్లాడారు. మండలంలోని మొత్తం 5 చెరువులు ఉన్నాయని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గాలను సుగమం చేయాలని చెప్పారు. అనంతరం ఝరి గ్రామంలో ఉన్న మంచినీటి పథకాన్ని పరిశీలించారు. రాబోయే రోజుల్లో నిర్వహించే అన్ని కార్యక్రమాలకు స్థలాలను గుర్తించి పండులాగా చేయాలని మెట్టపిప్రి గ్రామంలో పంచాయతీ సిబ్బందితో చెప్పారు. రోడ్డు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలని, అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలకు లైట్లు అమర్చాలన్నారు. టెంట్లు, డీజేలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచులు, జేపీఎస్‌లు, ఈజీఎస్ టీఏలు ఉన్నారు.

ముగిసిన 'కంటివెలుగు'

బోథ్: మండలంలో కంటివెలుగు కార్యక్రమం గురువారం ముగిసింది. కౌఠ(బి) గ్రామంలో వైద్యాధికారి నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 24 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 5585 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. సర్పంచ్ రా ధిక గంగాధర్, ఉప సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి వినోద్, సూపర్‌వైజర్స్ భారత, లక్ష్మి, జుహిదా, వీణసాగర్, రాజేందర్ రెడ్డి, ఆప్తాల్మి క్ భాస్కర్, రాజు, చంద్రకళ, ఆశ పాల్గొన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: సిరిచెల్మలో ఆదివాసీ మండల నాయిక పోడ్ ప్రధాన కార్యదర్శి బైరి చిన్నయ్య తండ్రి బైరి భీమన్న మరణించారు. దీంతో గురువారం బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరత్ వారి కుటుంబీకులను పరామర్శించారు.

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు సంతోశ్‌గౌడ్ పెద్దమ్మ గీతవ్వ మృతి చెందారు. ఈ విషయాన్ని కార్యకర్తల ద్వారా తెలుసుకున్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ గురువారం బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

ముగిసిన ఉర్సు



ఖవ్వాలి పాడుతున్న గాయకుడు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని డొనల్ ప్రాంతంలోని సయ్యద్ తాలిబ్ అలీషా బాబా దర్గా ప్రాంగణంలో రెండు రోజులుగా కొనసాగిన ఉర్సు ఉత్సవాలు గురువారం ఉదయంతో ముగిశాయి. బుధవారం రాత్రి దర్గా ప్రాంగణంలో ఉర్సు నిర్వహించడంతోపాటు ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. దర్గాలో పలువురు ప్రార్థనలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. రాత్రి నుంచి ఉదయం వరకు ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఉర్సు ఉత్సవ, దర్గా కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సాదిక్ పాషా, ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 6న నిర్వహించే భారీ బహిరంగ సభను ఆదివాసీలు విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు, షెడ్యూల్, బీసీ, మైనార్టీ కులాలు, బహుజనులు, అంబేద్కర్ వాదులు తరలిరావాలన్నారు. తుడుం దెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉయిక ఇందిరా, సలాం వరుణ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: రైతులు జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం వ్యవసాయ మా ర్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న, మొక్కజొన్న పంటలను ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సర్పంచ్ చౌహాన్ సునీత, రాథోడ్ ప్రవీణ్, రాథోడ్ ప్రకాశ్, రమేశ్, జాదవ్ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని బోథ్ మార్కెట్‌యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేస్తామన్నారు.

నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ జిల్లాకేంద్రంతోపాటు మండలకేంద్రాల్లో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ రమమాన్, సంపత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇందులో జర్నలిస్టులు పాల్గొనాలని కోరారు. మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసనల్లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.